క్లుప్తంగా

లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు

మామిడికుదురు: స్థానిక వాసంశెట్టివారిపాలెం లక్ష్మీగణపతి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అలంకరణ, గణపతి హోమం తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. అనంతరం అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి గ్రామోత్సవం కనుల పండుగలా జరిగింది.

25వ తేదీలోగా భూ ఆధార్ చేయించుకోవాలి

సఖినేటిపల్లి: వ్యవసాయ పథకాలకు సరైన లబ్ధిదారులను గుర్తించి, పథకాలు వర్తింపజేసేందుకు కొత్తగా ప్రభుత్వాలు భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ తీసుకువచ్చినట్టు మండల ఏవో పీపీ నరసింహారావు అన్నారు. ఇందుకు రైతులు ఈ నెల 25వ తేదీ లోగా భూ ఆధార్ చేయించుకోవాలని ఏవో సూచించారు. సోమవారం శృంగవరప్పాడులో సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి అధ్యక్షతన రైతులతో సమావేశం ఆ శాఖ ఏర్పాటు చేసింది. ఏవో మాట్లాడుతూ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం చేపట్టినట్టు అన్నారు. రావి త్రిమూర్తులు, రైతులు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి శిక్షణపై సమీక్ష

రాజోలు: అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ ఇచ్చేందుకు మండల విద్యాశాఖాధికారి నల్లి మనోహరం ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద జరిగిన సదస్సులో రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, సూపర్‌వైజర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాజోలు బాలికోన్నత పాఠశాలలో రెండు విడతలుగా శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వచ్చే చిన్నారులకు బేసిక్ నైపుణ్యాలను నేర్పించాలన్నారు. అలాగే అంగన్‌వాడీలకు వచ్చే పిల్లల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలన్నారు.

మాంసం దుకాణాల తనిఖీ

ఆలమూరు: బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి వదంతుల నేపథ్యంలో మాంసం దుకాణాల తనిఖీ సోమవారం జరిగింది. దుకాణాల వద్ద నిబంధలు పాటించడంతో పాటు పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యతను తెలుసుకునేందుకు ఆలమూరు పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.అనిత ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మటన్, చికెన్ దుకాణాలను తనిఖీ చేశారు. తాజా మాంసాన్ని విక్రయిస్తున్నారా లేదా నిల్వ మాంసాన్ని విక్రయిస్తున్నారనే కోణంలో నిపుణుల చేత పరీక్షలు చేయించారు. వ్యాపారులందరూ అధికారులకు సహకరించి తాజా మాంసాహారాన్ని విక్రయించాలని, శుచి శుభ్రత పాటించాలని వ్యాపారులకు పశుసంవర్ధకశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు రక్షిత మంచినీరు

అయినవిల్లి: తాగునీటి ద్వారా అనేక రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక ఈఓపీఆర్డీ వాణిశ్రీబెహర అన్నారు. సోమవారం ఆమె ముక్తేశ్వరం మెయిన్‌రోడ్డులో ఉన్న మంచినీటిని ట్యాంకును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి 15 రోజులకొకసారి మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడం, క్లోరింగ్ చేయడం, ట్యాంకుల్లో మోటార్లు వచ్చిన ఇసుక మట్టి, నాచును తొలగించడం, బ్లీచింగ్ వంటి పనులు చేస్తుంటామన్నారు. ఈ పనులకు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో ఎప్పటికప్పుడు పరీక్షిస్తామన్నారు. ఆమెతో పాటు స్థానిక పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొబ్బరిపై డాక్యుమెంటరీ చిత్రీకరణ

మామిడికుదురు: కోనసీమ కొబ్బరిపై డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్నారు. విజవాడకు చెందిన యువకుడు వెంకట్ వికాష్ వేపూరి డాక్యుమెంటరీ చిత్రీకరణకు సోమవారం శ్రీకారం చుట్టారు. పాశర్లపూడిలంలో ఆదర్శ రైతు పెదమల్లు నాగబాబు కొబ్బరి క్షేత్రంలో పలు దృశ్యాలను చిత్రీకరించారు. నాగబాబు కొబ్బరి తోటల పెంపకం, వాటి ప్రాధాన్యత, వాటి ద్వారా వచ్చే ఆదాయం తదితర వివరాలను అనుభవ పూర్వకంగా వివరించారు. ఈ సందర్భంగా వెంకట్ వికాష్ వేపూరి మాట్లాడుతూ కొబ్బరితో సహజ సిద్ధంగా 30 రకాల ఉత్పత్తులు చేస్తున్నానన్నారు. కొబ్బరి పొడి, వర్జిన్ ఆయిల్, తదితర ఉత్పత్తులను తయారు చేసి వాటిని అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నానని చెప్పారు. త్వరలో కోకోస్ ముంజు (కోకోనట్ కెఫె) ఉత్పత్తి చేసి దాన్ని విజయవాడలో విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దశలవారీగా ఈ ఉత్పత్తులను అన్ని జిల్లాలలో విక్రయిస్తామన్నారు. హైదరాబాదు చెందిన సభ్యుల బృందంతో డాక్యుమెంటరీ చిత్రీకరణ చేపట్టారు. కోనసీమ కొబ్బరి గొప్పతనాన్ని డాక్యుమెంటరీ ద్వారా ప్రపంచానికి వివరించాలన్నదే తన తపన అని ఆయన వివరించారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

పి.గన్నవరం: గ్రామ శివారు తాటికాయలవారిపాలెం లంకలో అక్రమ మట్టి తవ్వకాలపై తహసీల్దార్ శ్రీపల్లవి ఆదేశాలతో సోమవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్న జేసీబీని, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దాడుల్లో ఆర్ఐ యన్నపు డాంగే, వీఆర్వోలు పి.నరసింహారావు, కోరుకొండ శ్రీనివాస్, దాసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో..

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- రేగుతున్న దుమ్ముతో ప్రయాణం నరకప్రాయం
- అమలుకు నోచుకోని గుంతలు పూడ్చే హామీ


గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్న చింతలూరు-కపిలేశ్వరపురం రోడ్డు


రాళ్లు లేచిపోయి ప్రమాదకరంగా మారిన పెనికేరు-వెదురుమూడి రోడ్డు

ఆలమూరు: సంక్రాంతి పండగ నాటికి గుంతలు లేని రహదారులుగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని గత ఏడాది నవంబర్‌లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. గుంతలు పూడ్చకుంటే సంబంధిత నియోజకవర్గ, మండల ప్రజా ప్రతినిధులు బాధ్యులను చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. సంక్రాంతి వెళ్లి పోయింది కానీ ఆలమూరు మండలంలోని అనేక రహదారుల దుస్థితి మాత్రం మారలేదు. సంక్రాంతి వెళ్లిపోయింది వచ్చే నెలఉగాది కూడా వస్తుంది కాని రోడ్లకు మోక్షం మాత్రం కలగడంలేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

రహదారుల్లో పూడ్చిన రాళ్లు లేచిపోయి..

కడియం-వెదురుమూడి రోడ్డులో ఉన్న 24 కిలోమీటర్ల పరిధిలోని పెనికేరు నుంచి వెదురుమూడి వరకూ ఎనిమిది కిలోమీటర్ల మేర రూ.40 లక్షల వ్యయంతో గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. ఒక వైపు పంట కాలువతో పాటు మరొక వైపు పంట చేలు ఉండడంతో అనేక చోట్ల రహదారి కృంగిపోయింది. గత జనవరి తొలి వారంలో సంబంధిత కాంట్రాక్టర్ కృంగిన ప్రదేశాలను వదిలేసి అరకొరగా నల్లకంకరతో గుంతలు పూడ్చారు. గంతలు పూడ్చి దాదాపు 45 రోజులు కావస్తున్నా ఇంకా తారురోడ్డు వేయలేదు, దీంతో నల్లకంకరతో పూడ్చిన గుంతల నుంచి రాళ్లు లేచిపోయి దుమ్ము ధూళీ వ్యాపిస్తోంది. వాహనాలు వెళుతుంటే వెనుక నున్న వాహనదారులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. దీనిపై పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది.

గుంతలు పూడ్చకుండా వదిలేశారు

చింతలూరు నుంచి కపిలేశ్వరపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న తొమ్మిది కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చకుండా వదిలేశారు దీంతో ఆ రహదారిలోని ప్రయాణం అస్తవ్యస్తంగా మారింది. అడుగడుగునా గుంతలు, గోతులు ఉండడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో రాత్రి వేళల్లో ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తి పోతున్నారు. రెండు మండలాలను కలిపే ఆ రహదారికి త్వరితగతిన గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఉమ్మడి రహదారుల వల్లే ఈ దుస్థితి

కొత్తపేట-మండపేట నియోజకవర్గాలను కలుపుతున్న పెనికేరు-వెదురుమూడి, చింతలూరు కపిలేశ్వరపురం రహదారులు ఉమ్మడి జాబితాలో ఉండటం వల్లే అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ రహదారుల్లో ఇటీవల కాలంలో అనేక పరిశ్రమలతో పాటు ఓఎన్‌జీసీ కార్యకలాపాలు అధికమై అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారి విస్తరణ చేపట్టకపోయినా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం దురదృష్టకరమని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇకనైనా ఇరు నియోజకవర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సత్వరమే స్పందించి ఆరహదారులను అభివృద్ధి చేసి హక్కుల పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

తాత్కాలిక మరమ్మతులను పూర్తి చేస్తాం

పెనికేరు-వెదురుమూడి రోడ్డులో పూడ్చిన గుంతలను త్వరితగతిన తారుతో నింపి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం, సంబంధిత కాంట్రాక్టర్ మరొక ప్రదేశంలో పనిచేయడంతో మరమ్మతులకు అంతరాయం ఏర్పడింది. అలాగే చింతలూరు-కపిలేశ్వరపురం రోడ్డు మరమ్మతులకు అవసరమయ్యే నిధుల మంజూరయ్యాయి.
– సూర్యనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ, కొత్తపేట

బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీఓ శ్రీకర్
- పశుసంవర్ధక శాఖ అధికారులు, కోళ్ల పెంపకందారులతో సమీక్ష


కొత్తపేటలో ఏడీలతో సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట: కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా పశుసంవర్ధక శాఖ అధికారులు, కోళ్ల పెంపకందారులు అప్రమత్తం కావాలని స్థానిక ఆర్‌డీఓ పీ శ్రీకర్ సూచించారు. బర్డ్‌ఫ్లూపై సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు (ఏడీ), కోళ్ల పెంపకందారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా బర్డ్ ఫ్లూ జిల్లాలో వ్యాప్తి చెందకుండా పశుసంవర్ధక శాఖ తీసుకుంటున్న చర్యలు గురించి అధికారులు వివరించారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ జిల్లాలో ఎక్కడా లేదన్నారు. అయితే ముందస్తు చర్యల్లో భాగంగా రేపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేసి కోళ్ల ఫారాల్లో ఏమైనా కోళ్ల మరణాలు సంభవించాయా? లేదా అని ప్రతిరోజు ఆరా తీస్తున్నామని తెలిపారు. కోళ్ల పెంపకందారులు కోళ్ల ఫారాల్లోకి ఇతరులను అనుమతించవద్దని, కోళ్ల ఫారాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ ఏడీలు డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ(కొత్తపేట), డాక్టర్ ఎస్ ఉమామహేశ్వరరెడ్డి (రావులపాలెం), డాక్టర్ అనిత (ఆలమూరు), డాక్టర్ ఎల్ విజయరెడ్డి (అమలాపురం), కోళ్ల పెంపకందారులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే లక్ష్యం పూర్తి


సూర్యారావుపేటలో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ఈఏడాది తొలి విడత నిర్వహించిన డీ వార్మింగ్ డే లక్ష్యం పూర్తయినట్టు చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో రెండో సారి సోమవారం ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. మండలంలోని రెండు పీహెచ్‌సీ పరిధిలో 12139 మంది బాలలకు గాను 11,672 మందికి ఆల్బెండజోల్ మాత్రలను అందించగా సోమవారం మళ్లీ సుమారు 500 మందికి అందించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు శివప్రసాద్, శ్రీనివాసరావు, ఉమ, బాలామణి పాల్గొన్నారు.

జీవ నియంత్రణతో నాణ్యమైన దిగుబడి


అంబాజీపేట పరిశోధన కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధిపతి చలపతిరావు

అంబాజీపేట: వ్యవసాయ రంగంలో జీవనియంత్రణా పద్ధతులను అనుసరించడం వల్ల నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర ఎన్‌బీవీ చలపతిరావు చెప్పారు. పి.గన్నవరంలోని గ్రేస్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బీఎస్సీ అగ్రికల్చర్ ఫస్ట్ ఇయర్ రెండో సెమిస్టర్ విద్యార్థులు 20 మంది సోమవారం స్థానిక ఉద్యాన పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పరిశోధనా స్థానంలో విద్యార్థులకు కీటక శాస్త్ర విభాగం-జీవనియంత్రణ ప్రయోగశాలలో జరుగుతున్న పరిశోధనలను, బదనికలను ప్రయోగశాలలో అభివృద్ధి చేయడం, కొబ్బరి, కోకోలో జరుగుచున్న పరిశోధనలతో పాటు తెగుళ్ల విభాగంలో జీవనియంత్రణ శిలీంధ్రాలను ప్రయోగశాలలో ఉత్పత్తి చేయటం వివరించారు, కొబ్బరి, కోకోలో తెగుళ్ల యాజమాన్యంలో జరుగుతున్న పరిశోధనలను విద్యార్థులకు చలపతిరావు వివరించారు. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా, క్షేత్ర స్థాయిలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, జీవనియంత్రణ పద్ధతులు అమలు చేయుడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.మమత, తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష విద్యార్థులకు జీవనియంత్రణ పద్ధతుల గురించి ఆమూలాగ్రం తెలిపారు. ఈ సందర్శనలో గ్రేస్ కళాశాల బొటనీ అధ్యాపకురాలు జి.పూజ, సహాయ సిబ్బంది సూదా మోహన్ ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు మేడిచర్లపాలెం విద్యార్థి


విద్యారి హర్షిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మలికిపురం: ఎన్ఎంఎంఎస్ పరీక్షతో మేడిచర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కడిమి హర్షిత్ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒ.సాయిబాబా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హర్షిత్ తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ వల్లీశ్వరి, ఎంపీటీసీ సభ్యులు ముత్యాల సాయిరాం, విద్యా కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ పోటీ పరీక్షలో గెలుపొందిన విద్యార్థికి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సంవత్సరానికి 12,000 చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుంది.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన జస్విత

సఖినేటిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జల్లి జస్విత ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జస్వితను, ఎస్ఎంసీ చైర్మన్ కొండా కిషోర్, హెచ్ఎం కే వీరాస్వామి, బోధనా సిబ్బంది అభినందించారు.

రీ సర్వేను ఉపయోగించుకోండి


విలసలో పట్టాదారుల అర్హతను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి తదితరులు

అయినవిల్లి: ప్రభుత్వ చేపట్టిన రీసర్వేవల్ల భూయజమానులకు మేలు చేకూరుతోందని జాయింట్ కలెక్టర్ నిశాంతి అన్నారు. సోమవారం ఆమె సిరిపల్లిలో రీసర్వే జరుగుతున్న తీరు ఆమె పరిశీలించారు. సిరిపల్లి గ్రామంలో 1169 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకూ 60 శాతం మంది రైతులు రీసర్వే చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఆధికారులకు సహకరించి రీసర్వే చేయించుకోవాలని సూచించారు. దూరంగా ఉన్న భూయజమానులకు సమాచారం ఇచ్చి ఈ సర్వే 100 శాతం పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. అలాగే విలసలో పట్టా భూములు పరిశీలించారు. ఆమె వెంట అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వెంకట్‌కు కళాకిరీటి ప్రతిభా పురస్కారం


సహజ కవి వెంకట్‌ను సన్మానిస్తున్న ప్రతాప్

అంబాజీపేట: స్థానికుడు, సహజ కవి పాలమూరి వెంకట్‌కు కళా కిరీటి ప్రతిభా పురస్కారం లభించింది. ఈ నెల 16వ తేదీన మల్కిపురం గాంధీ నగర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయని వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కవితా గానం చేసి పలువురిని అలరించి, అందరి మన్ననలను పొందడంతో ప్రతిభా పురస్కారం అవార్డు లభించిందన్నారు. కవితా గానం చేసినందుకు వెంకట్‌ను కళాకారుల సమక్షంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సన్మానించారు. కార్యక్రమంలో కొల్లి రామావతి, జి.ఈశ్వరి, టి.పార్థసారథి, చొప్పల రామారావు, కడలి కృష్ణారావు, అల్లూరి జానకి రామరాజు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

రాజోలు: అంగన్‌వాడీల్లో విధులు నిర్వహిస్తున్న కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచాలని కోరుతూ రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం ఆందోళన చేపట్టారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని నినాదాలు చేశారు. హెల్పర్ల పదోన్నతికి సంబంధించి నిర్దిష్టమైన నిబంధనలు అమలు చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్పు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీలకు అమలు చేయాలని, సాధికారిత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ రమాదేవికి అందజేశారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు బి.పైడితల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనూష తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు సిద్ధంకండి

- ఉపాధ్యాయులకు డీఈఓ సలీమ్ దిశా నిర్దేశం
- కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ ఆకస్మిక సందర్శన


కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు, విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ సలీం

కొత్తపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా తగిన ప్రణాళికలు రూపొందించుకుని విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) షేక్ సలీమ్ ఉపాధ్యాయులకు సూచించారు. డీఈఓ సలీమ్ సోమవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులను రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారు? మీ ఉపాధ్యాయులు ప్రణాళిక ఏమైనా ఇచ్చారా? ఉత్తీర్ణతకు, ఉత్తమ ఫలితాలు సాధనకు సులభంగా విద్యాబోధన రూపకల్పన చేశారా? మీరేమైనా ప్రణాళికాబద్ధంగా చదువుతున్నారా? సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారా? వంటి అంశాలపై ప్రశ్నించారు. ఉత్తమ ఫలితాలు సాధించండి అని ఉద్బోధించారు. మీ ఉన్నత భవిష్యత్‌కు ఈ పరీక్షలే మలుపు.. ఒక ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం హెచ్ఎం ఎస్.సత్యనారాయణ, పదో తరగతి బోధించే ఉపాధ్యాయులతో సబ్జెక్ట్ వారీగా సమీక్షించారు. ప్రతి సబ్జెక్ట్‌లోనూ విద్యార్థినులు ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. డీఈఓ వెంట ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి ఉన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే నూరు శాతం పూర్తి చేయాలి

అంబాజీపేట: సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎస్.మురళీకృష్ణ, ఐపీఓ ఎ.మాధురి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.వి.సరోవర్ అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంఎస్ఎంఈ సర్వేపై సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వేను చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోను కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గం ట్రేడింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, సరీవ్స్ సెంటర్, సర్వీస్ షాపుల వివరాలను యాప్ ద్వారా సేకరిస్తారన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి ఆయా షాపుల నిర్వాహకులు సహకరించాలని కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బెడ్డు నిర్మాణాన్ని నిలిపి వేయాలి


మామిడికుదురులో ఈదరాడ గ్రామస్తులు ధర్నా

మామిడికుదురు: ఈదరాడ గ్రామంలోని ముళ్ల కాలువ పక్కన ఉన్న శ్మశాన వాటికలో చేపట్టిన ఆర్‌సీసీ బెడ్డుతోపాటు షెడ్డు నిర్మిస్తున్నారని దానిని నిలిపివేయాలంటూ స్థానికులు సోమవారం ధర్నా చేశారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ శరణ్యకు వినతిపత్రం ఇచ్చారు. 2014-15 మధ్య కాలంలో షెడ్డు, బెడ్డ నిర్మించాలని ప్రయత్నించారని చెప్పారు. అప్పట్లో దాన్ని అడ్డుకున్నామన్నారు. మళ్లీ శనివారం నుంచి కట్టడాలు చేపట్టారన్నారు. అక్కడ అన్ని వర్గాలు, కులాలు, మతాలకు చెందిన వారు దహన సంస్కారాలు నిర్వహిస్తారన్నారు. స్థలం తక్కువగా ఉండడం వల్ల సమస్య ఏర్పడుతుందన్నారు. కట్టడాలను నిలిపి వేసి యథావిధిగా స్థితి ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు నిరసనకు మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో ముసూకుడి నరసింహస్వామి, మస్కూడి విష్ణుమూర్తి, భూపతి శ్రీనివాసరావు, చుట్టుగుళ్ల రాజేష్, దాకే శ్యామల, జల్లి అక్కమ్మ, చుట్టుగుళ్ల నూకాలమ్మ, పెదపూడి ప్రసాద్, పాలమూరి సూరిబాబు, ఆకుమర్తి రాంబాబు, నక్కా కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుండా వేధింపులు

ఆలమూరు: రెవెన్యూశాఖ నిబంధనల మేరకు సర్వేకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోక పోగా డబ్బులు డిమాండు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని మండపేటకు చెందిన రైతు కాటా శ్రీరాములు ఆరోపించారు. సర్వేయర్ వల్ల తనకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు సోమవారం ఆలమూరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చాడు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించకపోవడంతో బాధితుడు శ్రీరాములు మీడియాను ఆశ్రయించాడు. గ్రామంలో 1.05 ఎకరాల భూమి ఉందని, అందులో సర్వేపరమైని ఇబ్బందులు ఎదురుకావడంతో సమస్యను పరిష్కరించాలంటూ గ్రామ సచివాలయం-1లో దరఖాస్తు చేసుకున్నానన్నాడు. దీంతో స్థానిక సర్వేయర్ సలాది స్వామి భాగ్యారావు లంచం డిమాండు చేశాడన్నారు. పని పూర్తి కావాలంటే ఖర్చు అవుతుందని చెప్పాడన్నారు. అందులో భాగంగా సర్వేయర్ స్వామి ఫోన్‌పేలో డిసెంబర్ ఆరున రూ 1000, ఏడున రూ 1500 జమచేశానన్నాడు. మిగతా సొమ్ము పని పూర్తయిన వెంటనే చెల్లిస్తానని హామీ ఇచ్చినా పట్టించుకోకుండా సీనియర్ సిటిజన్ అయిన తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. విధి లేని పరిస్థితుల్లో తాను ఎదుర్కొన్న సమస్యలను మీడియా ముఖంగా తెలియపర్చానని బాధిత రైతు శ్రీరాములు తెలియజేశారు. దీనిపై డిప్యూటి తహసీల్దార్ టి.సుబ్బరాజును వివరణ కోరగా సర్వేయర్ స్వామి లంచం డిమాండు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విచారణ జరిపి నేరం రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శివరాత్రికి సిద్ధమవుతున్న వృద్ధగౌతమి


వృద్ధగౌతమి స్నాన ఘాట్‌లో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది, పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ వాణిశ్రీబెహర

అయినవిల్లి: ముక్తేశ్వరం వృద్ధగౌతమిపాయలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా అయినవిల్లి పంచాయతీ అధికారులు తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులను సోమవారం ఈఓపీఆర్డీ వాణిశ్రీబెహర పరిశీలించారు. స్నానాల రేవులో మెట్లపై మట్టి, బురదను తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. నదీలో మెలచిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న శ్మశాన వాటికకు వచ్చేశారు. ఈ స్నానాల రేవులో పిండ ప్రధానాలు, మూసివాయినాలు మొదలైన చేయడం వల్ల వచ్చే మట్టి కుండలు, పెంకులు, అలాగే మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, ప్లాసింగ్ వ్యర్థాలతో ఈ ప్రాంతమంతా చెత్తగా మారింది. ఈ చెత్తను తొలగించి మొత్తం శుభ్రం చేయిస్తున్నారు. ఈ పనులను ఈఓపీర్డీ వాణిశ్రీ బెహర, పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ అధికారి శివ, పంచాయతీ సిబ్బంది పరిశీలించారు. స్నానాలకు వచ్చే యాత్రికులకు, భక్తులకు ఇబ్బందుల లేకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని ఈఓపీర్డీ తెలిపారు. అలాగే రేవులో మోటార్ల సాయంతో నీటిని తోడించి భక్తులకు పుణ్యస్నానాలు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే జల్లు స్థానాలు ఏర్పాటు చేసేందుకు పైపులైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలు

బాలుర విజేత తూర్పు, బాలికల విజేత పశ్చిమ గోదావరి జిల్లాలు


నెట్‌బాల్ బాలుర విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జిల్లా జట్టు

రావులపాలెం: స్థానిక డాన్ బాస్కో హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగు తున్న 10 వ రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్-19 బాల,బాలికల నెట్ బాల్ పోటీలు సోమవారం రెండో రోజుతో ముగిసాయి. లీగ్ కం నాకౌట్ విధానంలో జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో విజేతగా తూర్పుగోదావరి జిల్లా, బాలికల విభాగంలో విజేతగా పశ్చిమ గోదావరి జిల్లా జట్లు నిలిచినట్టు తూర్పుగోదావరి జిల్లా నెట్ బాల్ సంఘ కార్యదర్శి, రాష్ట్ర నెట్ బాల్ సంఘకార్యదర్శి పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పుగోదావరి జిల్లా నెట్ బాల్ సంఘ అధ్యక్షుడు కె.అశోక్ రెడ్డి, డాన్‌బాస్కో హై స్కూల్ ప్రిన్సిపాల్ ఐ. బల్తాజార్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని రాష్ట్ర నెట్ బాల్ సంఘ వైస్ ప్రెసిడెంట్ పి. తిరుపతయ్య, ట్రెజరర్ ఎం .వీరాంజనేయులు తెలిపారు.

నెట్ బాల్ బాలుర విజేతలు: ప్రథమ స్థానంలె తూర్పుగోదావరి జిల్లా, ద్వితీయ స్థానంలో విశాఖ జిల్లా, తృతీయ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా గెలుపొందారు. నాలుగో స్థానం నెల్లూరు జిల్లా నెట్ బాల్ బాలికల విజేతలుగా నిలిచారు. ప్రథమ స్థానం పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా, తృతీయ స్థానంలో శాఖ జిల్లా, నాలుగో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా విజేతలుగా నిలిచాయి.